క్లుప్తంగా

డిజిటల్ బ్యాంకింగ్‌పై అవగాహన



ర్యాలీలో పాల్గొన్న బ్యాంకు అధికారులు, సిబ్బంది

కడప కోటిరెడ్డిసర్కిల్ : డిజిటల్ బ్యాంకింగ్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కెనరా బ్యాంకు రీజినల్ మేనేజర్ అరుణ జ్యోతి తెలిపారు. కడప నగరంలోని ఏడు రోడ్ల కూడలిలో బుధవారం డిజిటల్ బ్యాంకింగ్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డిజిటల్ బ్యాంకింగ్‌లో వినియోగించగలిగే సురక్షితమైన సౌకర్యవంతం విధానాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేనేజర్లు రమేష్, విలియం, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

బీజేపీ కులగణన నిర్ణయం హర్షణీయం


మాట్లాడుతున్న డీఎం.ఓబులేసుయాదవ్

కడప ఎడ్యుకేషన్ : త్వరలో జరగనున్న జనాభా లెక్కలతో పాటు కులగణన చేపట్టాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కేబినెట్ నిర్ణయించడం హర్షణీయమని బీసీ యునైటెడ్ నేషనల్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు డీఎం.ఓబులేసుయాదవ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1931 నుంచి ఇప్పటి వరకూ ప్రభుత్వాలు మారినా, కులగణన చేపట్టలేదన్నారు. సామాజిక న్యాయం, విద్యా ఉద్యోగాల్లో సమానావకాశాలు, రాజకీయ రిజర్వేషన్లలో బీసీల వాటాపై స్పష్టత వస్తుందన్నారు.

4న కడప నగరంలో లాంగ్‌మార్చ్

కడప సెవెన్‌రోడ్స్ : వక్ఫ్ సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తూ ఈ నెల 4న(ఆదివారం) కడప నగరంలో నిర్వహించనున్న లాంగ్‌మార్చ్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని మాజీ ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ.అంజద్‌బాషా కోరారు. నగరంలోని తన నివాస కార్యాలయంలో పాస్టర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సుభాన్‌బాషా, పులి సునీల్‌కుమార్, కార్పొరేటర్ షఫీ, క్రిస్టియన్ మైనార్టీ జిల్లా అధ్యక్షులు షడ్రక్ రాజు, రాష్ట్ర కార్యదర్శి పాస్టర్ జాన్ తదితరులు పాల్గొన్నారు.

వాణిజ్య శాస్త్రంలో డాక్టరేట్


డాక్టరేట్ నోటిఫికేషన్‌ను అందుకుంటున్న మురళి

కడప ఎడ్యుకేషన్: అనంతపురం జిల్లాలో చేనేత కార్మికుల జీవితాలపై అధ్యయనం చేసిన యోగి వేమన యూనివర్శిటీ వాణిజ్య శాస్త్ర విభాగ రీసెర్చ్ స్కాలర్ ఎం.మురళికి డాక్టరేట్ (పీహెచ్‌డీ) లభించింది. అనంతపురం జిల్లాలో చేనేత కార్మికుల సంక్షిప్తత, సవాళ్ల అన్వేషణ- ఒక అధ్యయనం అంశంపై వాణిజ్య శాస్త్ర శాఖ ప్రొఫెసర్ ఎస్.రఘునాథరెడ్డి పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేసి మురళి విశ్వవిద్యాలయానికి సమర్పించారు. నిపుణుల బృందం అధ్యయనం చేసి ఈయన సమర్పించిన పరిశోధన గ్రంథానికి డాక్టరేట్‌కు అర్హత ఉందంటూ నిర్ధారించారు. ఈ మేరకు వైవీయూ పరీక్షల నియంత్రణాధికారి కృష్ణారావు డాక్టరేట్ ప్రకటిస్తూ నోటిఫికేషన్ జారీ చేశారు. ఎం.మురళి బీకాం, బీబీఏ విద్యార్థుల కోసం వివిధ టెక్స్టుబుక్‌లలో ఎనిమిది అధ్యాయాలను రాశారు. అనంతపురంలోని సాయిబాబా జాతీయ ఎయిడెడ్ డిగ్రీ కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేస్తున్నారు. వైవీయూ ఉపకులపతి ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.పద్మ, ప్రిన్సిపల్ రఘునాథరెడ్డి, అధ్యాపకులు, సహచర స్కాలర్లు మురళిని అభినందించారు.

పది ఫలితాల్లో హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ జయకేతనం


యజ్ఞేష్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్ : ఐసీఎస్సీ పదో తరగతి పరీక్షా ఫలితాలలో కడప హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. ఉత్తమ యాజమాన్యం, నిబద్ధత కలిగిన ఉపాధ్యాయ బృందం కృషి తల్లితండ్రుల ప్రోత్సాహంతోనే ఈ ఘనత సాధించామని ప్రిన్సిపల్ అమిత్‌సింగ్ తెలిపారు. హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో 66మంది విద్యార్థులు పది పరీక్ష రాయగా అందరూ ఉత్తీర్ణులయ్యారన్నారు. మూల యజ్ఞేష్‌రెడ్డి 96.2 శాతం, దొంతు హర్షితశ్రీ 95.4, తరుణ్ కుమార్ 94.8 శాతం మార్కులు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారన్నారు. విద్యార్థులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ శ్రీనివాసమూర్తి, రహంతుల్లా, విద్యార్థులు పాల్గొన్నారు.

కొండ దిగిన క్యారెట్ ధర


కిలో రూ.70 పలుకుతున్న అల్లం


కూరగాయలు

కడప అగ్రికల్చర్ : వేసవిలో ఎండలు అదరకొడుతున్నా కూరగాయల ధరలు కాసింత చల్లగానే ఉన్నాయి. సామాన్యుడికి నాలుగు పచ్చడి మెతుకులు నోటి కాడికి వెళ్తున్నాయి. మొన్నటి వరకు కొండెక్కిన క్యారెట్ ధర ఒక్కసారిగా పడిపోయింది. అల్లం ఘాటు కాస్త తగ్గింది. సామాన్యులకు కూరగాయల ధరలు కాసింత ఉపశమనాన్నిస్తున్నాయి. మొన్నమొన్నటి వరకు కిలో వందకు పైనేపలికిన క్యారెట్ ధర ప్రస్తుతం కిలో రూ.25కు చేరింది. అల్లం ధర రూ.200 పైగా పలకగా నేడు కిలో రూ.70 పలుకుతోంది. ఇకపోతే క్యాబేజీ, బీట్రూట్, వంకాయ, కీరకాయలు కిలో రూ.20కు చేరుకున్నాయి. దొండకాయ, బెండకాయ, ముల్లంగి, మిరపకాయలు కిలో రూ.25 రుపాయలు ఉన్నాయి. కాకరకాయ, మటిక్కాయి, కాలీఫ్లవర్ కిలో రూ.30లు ఉండగా మిగతా దోసకాయ, బంగాళాదుంప, బీరకాయలు మాత్రం కిలో రూ.35 పలుకుతున్నాయి. అలసందలు కిలో రూ.45, చిక్కుడు, అనపకాయలు, కాప్సికమ్ ధర కిలో రూ.50గా ఉంది. ఈ వేసవిలో కూరగాయల ధరలు తగ్గడంతో వినియోగదారులు కాస్త ఊరట చెందుతున్నారు.

ఘనంగా చాంద్‌ఫిరా గుంబద్ దర్గా నషాన్ ఉత్సవం


జెండాను అలంకరిస్తున్న ముస్లిం ప్రముఖులు

కడప ఎడ్యుకేషన్ : కడప రహమతుల్లా వీధిలో వెలసినచాంద్‌ఫిరా గుంబద్ దర్గా నషాన్ ఉత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ముందుగా దర్గా ముతవల్లి అమీరున్నిసా ఇంటి నుంచి మేళతాళాల మధ్య ఫకీర్లు గంధం తీసుకువచ్చి ఫాతెహా చేసి దర్గాలో సమర్పించారు. దర్గా ఆవరణంలోని జెండా వద్ద నషాన్ ఉత్సవం నిర్వహించి, జెండాను అలంకరించారు. మే 14వ తేదీ నుంచి 16వ తేదీ వరకు ఉరుసు ఉత్సవం నిర్వహిస్తున్నామని దర్గా పెద్దలు తెలిపారు. మే 14న గంధం, 15న ఉరుసు, 16న ఇతర కార్యక్రమాలు ఉంటాయన్నారు.

కల్యాణం.. కమనీయం


కల్యాణ వేదికపై మంగళ సూత్రాలను చూపుతున్న పురోహితులు

కమలాపురం : మండలంలోని సంబటూరులో వెలసిన శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వాముల వారి కల్యాణం కమనీయంగా జరిగింది. శ్రీ లక్ష్మిచెన్నకేశవస్వామి వారి 34వ వార్షికోత్సవాన్ని పురష్కరించుకుని బుధవారం ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజల ఆధ్వర్యంలో కల్యాణం వైభవంగా నిర్వహించారు. భక్తజనులు వీక్షిస్తుండగా పురోహితులు అమ్మవార్ల మెడల్లో మంగళ సూత్రాలను ధరించారు. అంతకు ముందు సుప్రభాత సేవ, పంచామృతాభిషేకములు నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని కాయ కర్పూరం సమర్పించి తమ భక్తిని చాటుకున్నారు. అనంతరం భక్తులకు నిర్వాహకులు అన్నదానం ఏర్పాటు చేశారు. సాయంత్రం గ్రామంలోని పుర వీధుల గుండా శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ లక్ష్మిచెన్నకేశవ స్వామి వారి ఉత్సవ విగ్రహాలకు గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచిపెట్టారు. అనంతరం నిర్వహించిన స్వామి వారి ఉయ్యాల సేవను వీక్షించేందుకు భక్తులు ఆసక్తి చూపారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా అలరించాయి.

ముగిసిన భగవద్గీత పారాయణం

సిద్దవటం : మండలంలోని మాధవరం-1 గ్రామంలో వెలసిన శ్రీ భద్రావతి సమేత భావనారాయణ స్వామి, శ్రీ కోదండరామ స్వామి ఆలయాల ప్రతినిధుల వారి ఆధ్వర్యంలో జరిగిన శ్రీమద్ భగవద్గీత పారాయణం కార్యక్రమాలు బుధవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా అనంతపురం జిల్లా శాంతానంద ఆశ్రమానికి చెందిన ఆధ్యాత్మిక గురువు గురుసేవానంద స్వామి, సుబ్బరామచంద్రులు శ్రీమద్ భగవద్గీత అమృత పఠనంపై గత మూడు రోజులుగా భక్తులకు వివరించారు. అనంతరం సుబ్బరామచంద్ర దంపతులను ఆలయ ప్రతినిధులు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.

వీఆర్‌ఏలకు వేతనాలు పెంచాలని ధర్నా


కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న వీఆర్‌ఏలు

కడప సెవెన్‌రోడ్స్ : గ్రామ సేవకులకు వేతనాలు పెంచాలని, కనీసం రూ.26వేలు ఇవ్వాలని వీఆర్‌ఏల సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు మనోహర్ డిమాండ్ చేశారు. కడప కలెక్టరేట్ వద్ద వీఆర్‌ఏ యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ అర్హులైన గ్రామ సేవకులకు పదోన్నతులు కల్పించకపోవడం అన్యాయమని తెలిపారు. ఇళ్ల స్థలాలు కేటాయించాలని, 70 శాతానికి పదోన్నతులు పెంచాలని కోరారు. లేబర్ కోడ్స్‌కు వ్యతిరేకంగా మే 20న జరిగే సమ్మెలో అందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వెంకటసుబ్బయ్య, చంద్రారెడ్డి, నాగేంద్ర, వెంకటపతి, రమణ, పవన్, మునెయ్య పెద్ద నారాయణ, వెంకటసుబ్బయ్య, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా జాయింట్ కలెక్టర్ అతిథి సింగ్‌ను వారు కలిసి వినతిపత్రం సమర్పించారు.

నేడు ఎంపీ, ఎమ్మెల్యే పర్యటన

ఒంటిమిట్ట : మండల పరిధిలోని చింతరాజుపల్లిలోని పత్రపల్లిలో గురువారం రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్ రెడ్డిలు పర్యటించనున్నారు. ఈ విషయాన్ని మండల వైఎస్సార్ సిపి శ్రేణులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గంగమ్మ జాతరకు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు.

ఎండకు అలసి.. నీడలో నిద్రించి



భానుడి ప్రతాపానికి వేసవిలో ఎండలు మదుతున్నాయి. కాసేపు బయట తిరిగితే చాలు ఇట్టే అలసిపోతున్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి సొంత పనులపై జిల్లా కేంద్రానికి వచ్చేవారంతా అపసోపాలు పడుతున్నారు. కడప విద్యుత్ భవన్ ఎదుట ఎండకు అలసిన కొందరు ఇదిగో ఇలా చెట్టు నీడలో నింద్రించడం పరిస్థితికి అద్దంపడుతోంది.

– రమేష్ తీట్ల, సాక్షి ఫొటోగ్రాఫర్

అంకితభావంతో పనిచేస్తేనే గుర్తింపు

జిల్లా ఎస్పీ ఈజీ.అశోక్‌కుమార్


పదవీ విరమణ పొందిన పోలీసు అధికారులతో ఎస్పీ అశోక్ కుమార్

కడప అర్బన్ : నిబద్ధత, అంకితభావంతో జిల్లా పోలీస్ శాఖకు అందించిన సేవలను ఆ శాఖ ఎప్పటికీ గుర్తుంచుకుంటుందని జిల్లా ఎస్పీ ఈజీ.అశోక్ కుమార్ అన్నారు. నగరంలోని పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో పదవీ విరమణ పొందిన కానిస్టేబుల్ ఎం.పర్వీన్, ఏఎస్ఐ జయశంకర్, ఎస్ఐ ఎస్.శ్రీనివాసులును బుధవారం ఆయన సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సుదీర్ఘకాలంపాటు శాంతిభద్రతల పరిరక్షణకు సేవలందించడం ఎంతో అదృష్టమన్నారు. పదవీ విరమణ పొందిన తర్వాత కూడా అందరూ పోలీసు కుటుంబంలో సభ్యులేనని, భవిష్యత్తులో ఎలాంటి సాయం కావాలన్నా ఆ శాఖ ఎల్లవేళలా తోడుగా ఉంటుందని ఎస్పీ భరోసా ఇచ్చారు. అనంతరం పదవీ విరమణ పొందిన సిబ్బంది కుటుంబ వివరాలను, పిల్లల చదువులు, ఉద్యోగ స్థితిగతులను గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు ఎస్.సుధాకర్, కె.శ్రీనివాసరావు, పోలీస్ అధికారులు దారెడ్డి భాస్కర్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, వీరేష్, శివరాముడు, జ్యోతి, పోలీస్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దూలం సురేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పు శంకర్, తదితరులు పాల్గొన్నారు.

కడప చిన్నారులకు గిన్నిస్‌బుక్‌లో స్థానం


చిన్నారులను అభినందిస్తున్న పాస్టర్ శ్యాంబాబు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగరానికి చెందిన 11 సంవత్సరాల ఎం.జర్మియ అభిషేక్, ఎనిమిదేళ్ల ఎం.జొన్న అభిషేక్, 12 సంవత్సరాల స్టైలిష్ స్పందనలు గిన్నిస్ బుక్‌లో స్థానం సంపాదించారని బెరాకా బెతిని చర్చి పాస్టర్ శ్యాంబాబు, మెర్సి శాంబాబు తెలిపారు. ప్రపంచ స్థాయి సంగీత కార్యక్రమాల్లో 18 దేశాల నుంచి మొత్తం 1090 మంది విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా కీ బోర్డుపై సరలి స్వరాలు వాయించగా, అందులో 1046 మంది విద్యార్థులు అర్హత సాధించారు. ఇందులో జిల్లాకు చెందిన చిన్నారులు తమ ప్రతిభను చాటుకుని గిన్నిస్‌బుక్‌లో స్థానం దక్కించుకున్నారు.బుధవారం సాయంత్రం తమ చర్చిలను చిన్నారులను అభినందించారు.చిన్నారులు భవిష్యత్తులో అద్భుత ప్రతిభను కనబరిచి జిల్లా పేరు ప్రఖ్యాతులనుచాటాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాల్ విల్సన్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్ల సమస్యలను పరిష్కరించండి


జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారిని సన్మానిస్తున్న కడప నగర పాస్టర్లు

కడప కోటిరెడ్డిసర్కిల్ : పాస్టర్ల సమస్యలను పరిష్కరించాలని కడప జిల్లా ఏపీ పాస్టర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు రెవ డా.మల్లెం విజయభాస్కర్ కోరారు. స్థానిక కలెక్టరేట్‌లోని జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారి హిదయతుల్లాను బుధవారం ఆయనతోపాటు పాస్టర్లు కలిసి సన్మానించారు. విజయభాస్కర్ మాట్లాడుతూ మ్యారేజ్ లైసెన్స్ రెన్యువల్ నూతన చర్చి నిర్మాణానికి ఆర్థిక సాయం చేయాలని, గౌరవవేతనం అందేలా చూడాలని కోరారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి సహాయం చేస్తానని మైనార్టీ వెల్ఫేర్ అధికారి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏపీపీఎఫ్ గౌరవ సలహాదారు బిషప్ కె.శామ్యూల్‌బాబు, కడప జిల్లా కార్యదర్శి ఎం.శామ్యూల్, నగర అధ్యక్షుడు సుధీర్‌కుమార్, నగర కార్యదర్శి కె.డేవిడ్‌రాజ్, పాస్టర్ అమర్, తదితరులు పాల్గొన్నారు.

సిద్దవటం కోర్టు ఏజీపీగా గాదె ఆదినారాయణ



ఒంటిమిట్ట : సిద్దవటం మున్సిఫ్ మేజిస్ట్రేట్ కోర్టు ఏజీపీగా ఒంటిమిట్టకు చెందిన గాదె ఆదినారాయణ నియమితులయ్యారు. సిద్దవటం, కడప తదితర ప్రాంతాల కోర్టులో పన్నెండు సంవత్సరాలుగా న్యాయవాదిగా గుర్తింపు పొందారు. కాగా న్యాయవాదిగా చేస్తున్న సేవలను గుర్తించి తమకు ఏజీపీగా అవకాశం కల్పించిన వారందరికీ వారు కృతజ్ఞతలు తెలిపారు.

వైద్య విద్యార్థులు మెరుగైన సేవలందించాలి


స్నాతకోత్సవంలో మాట్లాడుతున్న ఏక్యూ జవ్వాద్

కడప కోటిరెడ్డిసర్కిల్ : సమాజంలో వైద్య వృత్తి ఉన్నతమైనదని, ప్రతి విద్యార్థి మెరుగైన వైద్య సేవలందించాలని ఫాతిమా మెడికల్ కళాశాల సెక్రటరి ఏక్యూ. జవ్వాద్, కడప ఎమ్మెల్యే మాధవిరెడ్డి అన్నారు. ఫాతిమా మెడికల్ కళాశాలలో 2021వ బ్యాచ్ పీజీ, 2019 యూజీ విద్యార్థుల స్నాతకోత్సవ వేడుక బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకొని కళాశాల, తల్లిదండ్రులకు గౌరవం తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి, టీడీపీ నేత అమీర్‌బాబు, డాక్టర్ ప్రసాద్‌రావు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.శైలారేఖ, ఈడీ సల్మాన్ ముర్తాజ, సూపరింటెండెంట్ డాక్టర్ నగేష్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ రామమనోహర్ రెడ్డి, వైస్ చైర్మన్ ఫరూఖ్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ప్రజలు సహకరించాలి

కమలాపురం : నగర పంచాయతీ పరిధిలో ఎమ్మెల్యే చైతన్యరెడ్డి శంకు స్థాపన చేసిన అభివృద్ధి పనులకు ప్రజలు సహకరించాలని కమలాపురం మున్సిపల్ చైర్ పర్సన్ మార్పురి మేరి తెలిపారు. బుధవారం స్థానిక ఆ కార్యాలయంలో కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. మున్సిపల్ సిబ్బంది పలు అంశాలను చదివి వినిపించారు. వాటిపై సభ్యులు చర్చించారు. ఇటీవల సీసీ రోడ్లు, పైప్ లైన్ నిర్మాణం, పంపు సెట్ల ఏర్పాటు తదితర పనులకు శంకుస్థాపన చేశారని, ఆ పనులకు పట్టణ ప్రజలు సహకరించాలన్నారు. మున్సిపల్ కమిషనర్ పగడాల జగన్నాథ్ వైస్ చైర్మన్ సాదిక్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

సావిత్రిభాయి పూలె విగ్రహం ఏర్పాటుచేయాలి


డీఈఓకు వినతిపత్రాన్ని సమర్పిస్తున్న ఆర్‌వైఎఫ్ నాయకులు

కడప ఎడ్యుకేషన్ : మహిళా విద్య, సామాజిక సంస్కరణలకు పునాది వేసిన మహోన్నత వ్యక్తి సావిత్రి భాయి పూలె అని ఆర్‌వైఎఫ్ జిల్లా కార్యదర్శి భరత్ అన్నారు. సావిత్రిభాయి పూలె విగ్రహాన్ని డీఈఓ కార్యాలయ ఆవరణలో ఏర్పాటుచేయాలని డీఈఓ షంషుద్దీన్‌ను బుధవారం ఆయన కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా భరత్ మాట్లాడుతూ సావిత్రి భాయి పూలె స్థాపించిన బాలికల పాఠశాల భారత విద్యా చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచి పోయిందన్నారు. డీఈఓ కార్యాలయం విద్యా సంస్థలకు కేంద్ర బిందువుగా ఉన్నందున, ఇక్కడ సావిత్రిబాయి విగ్రహం ఏర్పాటుచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గోపి, సురేంద్ర పాల్గొన్నారు.

ఉత్తమ సేవకులకు తగిన ఆదరణ


లక్ష్మిభాస్కర్ దంపతులను సత్కరిస్తున్న నాయకులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆర్టీసీలో చీఫ్ మెకానికల్ ఇంజనీరుగా పి.లక్ష్మిభాస్కర్ అందించిన సేవలకు ఎప్పుడూ గుర్తింపు ఉంటుందని కార్మిక పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పీడీ.సిద్దయ్య, రాష్ట్ర ప్రచార కార్యదర్శి రహమతుల్లా తెలిపారు. ఆర్‌ఎం కార్యాలయంలో లక్ష్మి భాస్కర్ ఉద్యోగ విరమణ సందర్భంగా కార్మిక పరిషత్ జోనల్ కార్యదర్శి పురుషోత్తం ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కడప జోన్ వ్యాప్తంగా దాదాపు ఎనిమిది జిల్లాల్లో ఆయన అందించిన సేవలు అమోఘమన్నారు. బస్సుల కండీషన్, కేఎంపీఎల్ విషయంలో ఆయన సూచనలు ఎంతగానో ఉపయోగపడ్డాయన్నారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రారెడ్డి, మల్లికార్జున, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.